


# ఆశ అడుగంటింది

శాలివాహన

స్వింగ్‌డోర్‌ను తోసుకొని లోపలి కొచ్చి 'నమస్కారం' అన్నాడతను.

డాక్టరు మూర్తి తల పైకెత్తి చూశాడు. మెడిసన్ చదివే రోజుల్లో ఎనాటమి హాల్లోని స్కెలిటన్ గుర్తు కొచ్చిందతనికి. ఆ ఎముకల బొమ్మను అలా ముట్టుకుంటే చాలు, వివిధ విన్యాసాలు చేస్తున్నట్లు ఊగేది. ఎముకల గూడులావున్న ఇతను ముట్టుకోకుండానే ఊగిసలాడుతున్నాడు. ఇతను ఊపిరి పీల్చుకున్నప్పుడల్లా ఎదురొము ఎగిరెగిరి పడుతోంది. గాలిని పీల్చడానికి శ్రమిస్తున్నట్లుగా నాసికాపుటాలు సంకోచ వ్యాకోచాల్ని చెందుతున్నాయి.

అంతే కాదు, ఇతనికీ, ఆ ఎముకల బొమ్మకీ మరొక ముఖ్యమైన తేడాకూడా వుంది—ఆ బొమ్మ చర్మంతో కప్పబడి వుండేది కాదు, దుస్తులూ ఉండేవి కావు. ఇతనికా రెండూ వున్నాయి.

'నన్ను గుర్తుపట్టలేదా డాక్టర్?' అన్నాడతను జీవంలేని చిరునవ్వును పెదాల పైకి తెచ్చుకుంటూ.

డాక్టరు మూర్తి కొన్ని క్షణాలు అతని వైపు నిశితంగా చూసి, ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలా అన్నాడు. 'రాజూ! నీవా?'

అతని మొహంలో రవంత ఆనందం ఛాయా మాత్రంగా నిల్చింది. 'అవును డాక్టర్, నేనే, నిరుపేద రాజును.'

'నిన్ను మళ్లీ చూస్తాననుకోలేదోయ్' అని నాలుక్కరచుకున్నాడు మూర్తి. రాజు తనకేమి బంధువు కాదు. స్నేహితుడూ కాదు. కాని ఆత్మీయుడైన బంధువుకంటే మిన్నగా తనకు చేరువైనాడు. ఆ చనువుతోనే అలా అనగలిగాడు తను.

"నిజమే డాక్టర్, నేను బ్రతికే వున్నాను. కాదు డాక్టర్, అనుక్షణమూ మరణిస్తూ బ్రతుకుతున్నాను.'

'ఛా. అలా అనకు రాజూ! నేనా వుద్దేశ్యంతో అనలేదసలు. త్వరలో స్టేట్స్‌కు వెళ్దామనుకుంటున్నాను. వెళ్తే రెండు మూడేళ్ల వరకు తిరిగిరావటం పడదు. వెళ్లే లోపల నిన్ను చూడటం పడదేమోనన్న ఉద్దేశంతో అన్నాను.'

'ఫరవాలేదు డాక్టర్. నాకు మరణమంటే భయం లేదు. ఆ రోజు నన్ను హాస్పిటల్ నుండి డిశ్చార్జిచేస్తూ మీరన్నారు....రాజూ వైద్యశాస్త్రం ఇంకా పురోగతి చెందాలోయ్. చిరిగిన చొక్కాను తీసి చిలక్కొయ్యకు తగిలించి మరోచొక్కాను శరీరానికి తొడిగినట్లుగా రోగగ్రస్తమై బలహీనమైపోయిన హృదయాన్ని మార్చి, మరో హృదయాన్ని ఆ స్థానంలో వుంచేరోజు రావాలి. ఆ రోజు ఎంతో దూరంలేదని నా నమ్మకం. అంతవరకూ నీవు బ్రతికుండటమంటూ జరిగితే నీవు నూరు సంవత్సరాలు బ్రతకటం ఖాయం' అని. అంతే కాదు, మరో రెండు సంవత్సరాలకంటే ఎక్కువ గార్యంటీ ఇవ్వలేను. ఆ తర్వాత నీ

ఆరోగ్యం పూర్తిగా క్షీణించవచ్చు,' అని మీరన్నప్పుడు కూడా నాకు భయం వేయలేదు. మీరు చెప్పిన ఆ రోజు హృదయాలనే మార్చే రోజు—ఎప్పుడొస్తుందా అని ఆశతో ఎదురుచూశాను. గుండెల్లో నొప్పి, ఊపిరి అందకపోవటం, అలసట, కాళ్లకు, చేతులకు, మొహానికి నీరు చూపటం—ఓహ్, ఎన్నో బాధల్ని అనుభవిస్తున్నా నాలో ఆశ మాత్రం చావలేదు. అవును డాక్టర్, మీరు పెట్టిన గడువు రెండుసంవత్సరాలే. అయితే ఎనిమిదిసంవత్సరాలు బ్రతికున్నానంటే కారణం ఆ ఆశ మాత్రమే.' రాజు ఆయాసంతో ఆగి డాక్టరు వైపు చూడసాగేడు. శ్వాస పీల్చినప్పుడల్లా ఛాతీ ఎగిరెగిరి పడుతోంది. పైన ఫేను తిరుగుతున్నా అతని నుదురు స్వేద బిందువులతో నిండిపోయింది. లోతుగా ఉన్న అతని కళ్లలో మాత్రం ఆశ ఆరిపోని దీపంలా కొట్టుమిట్టాడుతోంది.

డాక్టరు మూర్తి మౌనంగా వుండటం రాజు మనసును నిరాశతో నింపింది. తనను చూడగానే ఆప్యాయంగా పలుకరిస్తాడని, 'ఆపరేషన్ చేసి, నీ జబ్బును కుదిర్చే భారం నాది. నీవేమీ బెంగపెట్టుకోకు' అంటూ భరోసాఇస్తాడని ఆశించి వచ్చిన రాజు డాక్టరు మౌనాన్ని చూసి నీరుకారిపోయాడు.

రాజు లాల్చీ జేబులో నుంచి ఒక కాగితం పొట్లాన్ని తీసి టేబులు మీద పెడ్తూ అన్నాడు : 'డాక్టర్ నా పరిస్థితి మీకు తెలుసు. క్రితంసారి కూడా మీకు స్వల్పమైన ఫీజు ఇచ్చాను. నేను బీదవాడ్ని. శ్రమిస్తే గాని పొట్ట గడవని సంసారం మాది. నాకున్న ఆస్థి పేదరికమే ఐనా, ఆనందంగా సగం పంచుకునే ఇల్లాలు, నేనేమీ తనకి మిగల్చననే సత్యాన్ని తెలుసుకోలేని ముక్కుపచ్చలారని ముగ్గురు బిడ్డలు—వాళ్ల కోసమైనా నేను బ్రకాలి డాక్టర్.' అతనికళ్లు అశ్రుపూరితాలైనాయి.

ఏ రోజూ కడుపునిండా తినలేకపోయినా, ఏ క్షణమూ ఆనందాన్ని చూడకపోయినా బ్రతుకు పైన, భవిష్యత్తు పైన ఆశ చావకుండా ఎందుకుంటుందో ఇప్పుడర్థమైంది డాక్టర్ మూర్తికి. తన భార్య, తన బిడ్డలు, వారికి తనేదో చేయాలనే తపన, వారిపై మమత, మమకారం ఇవేనా రాజును ఇన్నాళ్లూ ప్రాణంతో నిలబెట్టగలిగినవి ?

ఆశకు, నిరాశకు మధ్య వంతెనలా వున్న రాజును ఎలా ఓదార్చాలో ఏమని మాట్లాడాలో అర్థంకాలేదు డాక్టర్ మూర్తికి.

ఆవేదనను అణచుకుంటూ అన్నాడు రాజు. 'ఈ ఎనమిది సంవత్సరాలూ బ్రతకటానికి కవసరమైనంత తిండి మాత్రమే తిని ఈ డబ్బును కూడబెట్టేను డాక్టర్ ! ఎంతని అడగకండి. ఈ ఐదొందలూ మీకు తృణప్రాయమని నాకు తెలుసు. దీన్ని మీరు స్వీకరించి..'

'వెరీ సారీ రాజూ ! చెప్పేను కదా ! స్టేట్స్‌కి వెళ్లబోతున్నానని. ప్రభుత్వం వారు మన స్టేట్‌నుంచి నన్నే ఎంపిక చేశారు. నేను వెళ్లక తప్పదు. కాని నీకు ఆపరేషన్ చేసేందుకు అన్ని ఏర్పాట్లను చేసి వెళ్తాను.నీవు వెంటనే గవర్నమెంట్ హాస్పిటల్లో ఎడ్మిట్ అయిపో.'

రాజు ఆలోచనలో పడ్డాడు. తనకు డాక్టరు మూర్తిపైన అచంచల విశ్వాసం. ఇప్పుడే కాదు మొదటి నుంచీ కూడా అంతే. అందుకే ఎంతో మంది డాక్టర్లు హాస్పిటల్లో మారుతున్నా, డాక్టరుమూర్తి ఏ వూరికి బదిలీ ఐతే ఆ వూరికి తను వెళ్లి ట్రీట్‌మెంట్ తీసుకొనేవాడు. కాని ఇప్పుడు, తనకు జీవన్మరణ సమస్య ఈ ఆపరేషన్. అలాంటి ముఖ్యమైన ఆపరేషన్‌ను డాక్టరు మూర్తి లేకుండా తను చేయించుకోగలడా ?

విజ్ఞానశాస్త్రం ప్రగతిని సాధించి, హృదయాల్నే మార్చి మనిషి ఆయుః పరిమాణాన్ని పెంచే ప్రక్రియల్ని కనిపెట్టింది. డాక్టర్ మూర్తి కావాలని కోరింది, తను రావాలని ఆశించిందీ ఈ ప్రగతినే. కాని, ఇప్పుడీ అవాంతరమేమిటి ? తను తిరిగి పరిపూర్ణమైన ఆరోగ్యవంతుడుగా కనిపిస్తానని కలలు కంటున్న కమలకు తనేమని సమాధానం చెప్పగలడు ?

అతని ఆలోచనను చెదరగొడుతున్నట్లు టెలిఫోన్ గణగణ మ్రోగింది. డాక్టరు మూర్తి రిసీవరందుకుని మాట్లాడేడు. అతి ముఖ్యమైన సమాచారాన్ని వింటున్నట్లుగా వుంది డాక్టర్ మూర్తి మొహం. కొద్ది నిముషాల తర్వాత రిసీవర్ను యధాస్థానంలో పెట్టి రాజుతో అన్నాడు డాక్టర్ మూర్తి.

'నీ వదృష్టవంతుడవోయ్ రాజూ ! అనివార్య కారణాలవల్ల నా ప్రయాణం నెల రోజులు వాయిదా పడింది. ఈ నెల రోజుల్లో నీకు ఆపరేషన్ చేసి నా బాధ్యత నెరవేర్చుకుంటాను. కమాన్ లెట్ మీ సీ యువర్ కండిషన్ .'

డాక్టరు మూర్తి రాజును పరీక్ష చేయసాగేడు. బి. పి. చూశాడు. ఇ. సి. జి. తీశాడు. బ్లడ్ గ్రూప్ నోట్ చేసుకున్నాడు. ఆపరేషన్‌కు తేదీ నిర్ణయించాడు.

* * *

'కమలా ! కమలా !!'

పరుగులాంటి నడకతో ఇంట్లోకి వస్తూనే భార్యను పిల్చాడు రాజు.

చిరిగిపోయిన పెద్దపిల్ల గౌనును సూదీ, దారంతో కుడుతున్న కమల భర్త హడావిడిని చూసి క్షణంసేపు చేస్తున్న పనిని ఆపింది.

'డాక్టరు మూర్తి నాకు ఆపరేషన్ చేస్తానన్నాడు కమలా. తేదీ గూడా నిర్ణయించాడు. వచ్చే సోమవారమే. దేనికైనా టైం కలిసిరావాలి. మొదట్లో నన్ను చూసి నీవింకా బ్రతికే వున్నావా అన్నట్లు మాట్లాడేడు. అసలు ఆయన


అమెరికా ప్రయాణం ఆగిపోయింది నా కోసమే నేమో....'

కమల మౌనంగా వింటోంది. నిరాసక్తంగా ఉండిపోయింది. భర్తకు ఆపరేషన్ చేయబోతున్నందుకు భయమూ లేదు, ఆపరేషన్ జరిగి భర్త కోలుకుంటాడని ఆనందమూ లేదు. ఆమె మనసు ఏ అనుభూతినీ అందుకోలేని శిలగా తయారైంది.

కమల అందించిన మంచినీళ్లు తాగి ఆయాసంతో మంచంపై వాలిపోయాడు రాజు.

ఆ రోజూ ఇంతే. డాక్టరు వద్దకు వెళ్లొచ్చి 'విజ్ఞానశాస్త్రం ప్రగతిని సాధిస్తోందని, మనిషి హృదయంలోని రోగగ్రస్తమైన భాగాలను శస్త్ర చికిత్సద్వారా బాగుచేసి, హార్ట్ పేషెంట్ ఆయుఃపరిమాణాన్ని పెంచగలిగే సమయం అద్యతన భావిలో ఉందనీ, అప్పటివరకూ ఆగగలిగితే, ఆపరేషన్ జరిగేవరకూ జీవిస్తే ఆ తర్వాత నీది పూర్ణాయుర్దాయమే' అన్న డాక్టరు మాటల్ని యథాతథంగా తనకు వినిపించి ఆయాసంతో ఇలాగే మంచంమీద పడుకొన్నాడు. అప్పుడు డాక్టరు మాటల్ని యథాతథంగా నమ్మే అతని తత్వంమీద తనకు కోపమూ వచ్చింది, జాలీ కలిగింది. కాని, ఏమీ మాట్లాడలేకపోయింది. ఏమంటుంది ? డాక్టరు మాటల్లో నీవెక్కువ రోజులు బ్రతకవు అనే అర్థం ఉంది అని చెప్పి అతన్ని కృంగదీయగలదా ? తనకు తోచిన అర్థం ఆయనకెందుకు తోచదు ?

అప్పుడే తనకు బ్రతుకుపట్ల భయం కలిగింది. గాలిలో దీపం లాంటి రోగగ్రస్తమైన హృదయం ఏ క్షణంలోనైనా ఆగిపోవచ్చు. ఆ పైన తనకూ, తన ముగ్గురు పిల్లలకూ దిక్కెవరు ? చాకలిపద్దు వరకే పరిమితమైన తన చదువు తన జీవికకు ఉపయోగిస్తుందా ? తన కిక దారేమిటి ?




కకావికలమైన మనసుతో ఆలోచిస్తున్న కమలకు రాజారావు జ్ఞాపకం వచ్చాడు. రాజారావు ఆమెకు మేనబావ.

కమల పుట్టిన క్షణంనుంచీ రాజారావుకు భార్య పుట్టిందనే అనుకున్నారు రెండు కుటుంబాలవారు.

రెండు కుటుంబాలూ ఒకే ఊళ్లో ఉండటంచేత వారిద్దరి మధ్య స్నేహం వయసుతోబాటు పెరిగింది.

రాజారావు స్కూలుఫైనల్ చదివే రోజుల్లో అతనికి తీవ్రమైన జ్వరం వచ్చింది. ఆ జ్వరం తగ్గినా, ఆ జ్వరపు గుర్తులా అన్నట్లు అతని చేతులమీద, మొహంమీద తెల్లని మచ్చలు నిల్చిపోయాయి. రాజారావుకు బొల్లి వ్యాధి వచ్చింది అన్నారందరూ.

రాజారావు అంటే బావ అనే భావం మినహా మరో అనుబంధాన్ని అప్పటివరకూ పెంచుకొనని కమల అతని వ్యాధిని చూసి అతని పట్ల ఏహ్యతను పెంచుకుంది.

కమల మనోభావాన్ని పసిగట్టిన ఆమె తల్లిదండ్రులు కమలకు మరో సంబంధాన్ని వెదికి రాజుకు కట్టబెట్టేరు.

గడ్డిపూవు లెమ్మని విడిచిపుచ్చిన పుష్పం వింత పరిమళాలను వెదజల్లుతుంటే ఆశ్చర్యపడకుండా ఎవరుండగలరు ?


కమల మొదటి కాన్పుకు పుట్టింటికెళ్లినప్పుడు అలాగే ఆశ్చర్యపడింది. రాజారావు కాలేజీచదువు పూర్తిచేయటమే గాకుండా తనకున్న వ్యాధిని కూడా పూర్తిగా నయంచేయించుకుని వచ్చాడని విని.

కూతురు బారసాలకు వచ్చిన రాజుకు రాజారావును పరిచయం చేసింది కూడా. చేసి 'అతనికా సమయంలో ఆ వ్యాధి పొడసూపకుండా ఉంటే మావాళ్లు నన్ను అతని కిచ్చి పెళ్లిచేసేవారు' అన్నది. రాజు నవ్వి ఊరుకున్నాడు.

ఆ సంవత్సరమే రాజుకు ఆయాసం, అలసట ప్రారంభమై అతన్ని హార్ట్ పేషెంట్‌గా స్థిరపరిచింది.

మనమే దో తెలివిగల వాళ్లమని భ్రమిసి రాబోయే ప్రమాదాన్ని తప్పించుకోవాలని తొలగి కూర్చుంటాం. కాని అలా తొలగి కూర్చున్నందువల్లనే ప్రమాదానికి లోనైనామని తెలుసుకొన్నప్పుడు, అలా తొలగి కూర్చోకుండా ఉంటే బాగుండేది అని వాపోతుంటాం. కమల కిప్పుడు అలాంటి పరిస్థితే సంభవించింది.

వ్యాధిగ్రస్తుడైనాడని రాజారావు పట్ల విముఖతను పెంచుకున్న కమల, అంతకంటే ప్రమాదభూయిష్టమైన వ్యాధికి భర్త బలికాబోతున్నాడని తెలిసికొని కృంగిపోయింది. భర్తపడుతున్న నరక




యాతన, అతని అనిశ్చితమైన ఉద్యోగం, చాలీచాలని జీతం, పెరుగుతున్న జీవన వ్యయ భారం, వీటన్నిటినీ మించి డాక్టరు మాటలు ఆమెలో నిస్థైర్యాన్ని కరిగించివేసినై.

తను పట్టుకున్న కొమ్మ ఏ క్షణాన్నైనా విరిగి తనని మున్నీట ముంచుతుందని తెలిసికూడా మరో ఆధారాన్ని వెతుక్కోకుండా ఊర్కోటం మూర్ఖత అనిపించుకుంటుందనే సత్యాన్నినమ్మిన కమల కాగితం కలం తీసుకొని రాజారావుకు ఉత్తరం వ్రాసింది.

'బావా!

ఇటీవల మన వూరు వెళ్ళినప్పుడు నీ అడ్రసు కనుక్కున్నాను. అప్పట్లో నీకు ఉత్తరం వ్రాయాలని కూడా నేను అనుకోలేదు. కాని ఎందుకో.... అడ్రసు అడిగి తెలుసుకున్నాను. ఇప్పుడు దాని అవసరం నాకు కన్పించింది.

మార్కెట్లో కూరల దగ్గర్నుంచి అన్ని వస్తువులను ఏరి, ఏరి మంచీ చెడూ చూసి, చూసి తీసుకుంటాం. అలాగే జీవిత భాగస్వాములను కూడా. కాని బావా మనం ఎంత వెఱ్ఱివాళ్ళమో తర్వాత గాని తెలుసుకోలేము. అప్పట్లో నీ చేతులమీద, మొహంమీద ఏర్పడిన మచ్చలు నీపట్ల నాకు విముఖతను ఏర్పరచాయి. మంచి సంబంధం అని చేసుకున్న మావారు అంతకంటే ప్రమాదమైన, ప్రాణాపాయమైన వ్యాధితో ఇప్పుడు బాధపడుతుంటే నేనేం చేయగలుగుతున్నాను? డాక్టరు చెప్పేరుట, విజ్ఞానశాస్త్రం ఎంతో ప్రగతి సాధించి గుండెల మార్పిడీ చేయగలిగినప్పుడు మావారి ఆరోగ్యం కుదుటపడుతుందిట! ఇది అయ్యేపనేనా? ఆయన వ్యాధిని తలచుకుంటున్నప్పుడు జీవితం బుద్బుదప్రాయం అనే వేదాంత ధోరణి కలుగుతోంది. నిన్ను కాదన్న నేరానికి నాకీ శిక్ష పడాల్సిందే. మా అమ్మ అంటుండేది, ఘటనను తప్పించగలమా అని. మావారు గొప్ప ఆశాజీవి. ఆయన ఆశయం ఫలించి, ఆయన కాజబ్బునయమైతే నాకంతకంటే కావలసినదేముంది? కాని, అన్నీ మనం అనుకున్నట్లు జరగవు కదా! జరగకూడనిదే జరిగితే, ముగ్గురు పిల్లలతో నేను ఏ దారి చూసుకొనాలో తోచకుండా వుంది.—కమల'

ఉత్తరం పోస్టుచేశాక కమల తను తొందరపడ్డానా అని వితర్కించుకుంది. ఆ ఉత్తరం ద్వారా తానేమీ ఆశించలేదు. కేవలం మనసులోని ఆవేదనను మరొకరితో పంచుకోవాలనే ఉద్దేశ్యంతోనే అలా రాసింది. రాజారావు నుండి జవాబు వస్తుందని కూడా ఊహించలేదామె.

నిశ్చలమైన నీటిలో రాయివేసి అలలను రావద్దని శాసించలేం కదా!

వారం రోజుల్లో రాజారావు నుండి జవాబు వచ్చింది.

'కమలా!

నీ దగ్గర్నుండి ఉత్తరంవచ్చినందుకు ఎంత సంతోషించానో అందులోని విషయాలను అర్థంచేసుకుని అంతగా బాధపడ్డాను. మీ వారికి వచ్చిన జబ్బు, అది నీలో కల్గిస్తున్న భయాందోళనలు నీ ఉత్తరంలో రూపుకట్టి నిల్చినై. ఒక్క విషయం గుర్తుంచుకో కమలా! భయపడి కూర్చుంటే మనమే పనీ చేయలేము. ధైర్యంగా ఉండు. జరిగేదాన్నెవరూ ఆపలేరు కదా! ఏమైనా, నీకు నేనున్నాను. నిన్నూ నీ పిల్లలను అనాథలుగా ఉండనీయను. నేను బ్రతికేఉన్నాననే విషయం గుర్తుంచుకొని ఉత్తరం రాసినందుకు కృతజ్ఞుణ్ణి.—రాజారావు'

అనుకోకుండా వచ్చిన ఆ జవాబును చదివిన కమల తనను రాజారావు ఎలా అర్థం చేసుకున్నాడో ఊహించింది. అప్పుడే స్ఫురించిందామెకు. రాజారావు ఇంకా వివాహం చేసుకోలేదని.

ఉత్తరాన్ని పెట్టె అడుగున పారేసి దాన్ని మర్చిపోవాలనే ప్రయత్నించింది. మర్చిపోయింది కూడా.

కాని ఈ రోజు....


డాక్టరు తనకు ఆపరేషన్ చేయటానికి తేదీ నిర్ణయించాడని రాజు చెప్పినప్పుడు.

తన వ్యాధి నయమైపోయి, తను పరిపూర్ణమైన ఆరోగ్యవంతుడు కాబోతున్నాడనే సంతోషం రాజుకళ్లలో తళుక్కున మెరిసినప్పుడు....

మరుగునపడిన ఆలోచనలు తేనెటీగల్లా ఒక్కసారి విజృంభించాయి.

* * *

రాజుకు ఆపరేషన్ జరిగి నెల దాటింది.



ఆ నెలరోజులూ భర్తను అహరహమూ కంటికి రెప్పలా చూసుకొంటూనే వుంది కమల. అతను ఆరోగ్యవంతుడు కావాలని వెయ్యి దేముళ్ళకు మొక్కుకొంటూనే వుంది.

అయినా అప్పుడప్పుడూ రాజారావు ఉత్తర జ్ఞాపకంవస్తూనే వుంది. 'నిన్నూ నీ పిల్లలను అనాథలుగా ఉండనీయను' అని ఎవరో చెవుల్లో రొదచేస్తున్నట్లుగానే తోచిందామెకు.

రాజు హాస్పిటల్‌నుండి డిశ్చార్జ్ చేయబడి ఇల్లు చేరుకున్నాడు.

అతనికిప్పుడు ఎంతో తేలిగ్గా వుంది. ఇదివరకటి అలసట, ఆయాసం ఇప్పుడేమీ లేవు. గుండెలోని బరువునంతా ఎవరో చేత్తో తీసివేసినట్లుగా అనుభూతి చెందసాగేడు.

ఎంత తేడా !........

ఆరోగ్యానికీ అనారోగ్యానికీ ఎంత తేడా ! తను ఇన్నాళ్లూ గడిపింది జీవితమా ? కాదు నరకం.

తనలో వచ్చిన మార్పును వేయి గొంతులతో చాటి చెప్పాలనే కోరిక అతనిలో పొడసూపింది.

కాని ఆ మార్పును, ఆ తేడాను తాను పూర్తిగా వ్యక్తీకరించ గలడా ? మాటలతో చెప్పలేని భావాన్ని కళ్లకు కట్టినట్లు చూపించగలిగితే ?

అవును అది మంచి మార్గం.

అందుకు సాధనమూ వుంది.

ఎనిమిది సంవత్సరాల క్రితం తనకు తీసిన ఇ.సి.జి అప్పటి తన హృదయం యొక్క స్థితిని తెల్పుతుంది.

తననిప్పుడు హాస్పిటల్ నుండి డిశ్చార్జి చేస్తూ తీసిన ఇ. సి. జి ఇప్పటి తన స్థితిని తెల్పుతుంది.

రెంటిలోనూ ఉన్న రేఖల గమనంలో ఉన్న తేడా....

ఎనిమిది సంవత్సరాల నిరీక్షణానంతరం తన ఆరోగ్యంలో వచ్చిన మార్పు....

ఒక్కటే.

అదే విజ్ఞానశాస్త్రం సాధించిన ప్రగతి.

ఆ ప్రగతిని కంటితో చూడాలి..

రాజు గబగబా లోపలి గదిలోకి నడిచాడు. ఒక చేత్తో హాస్పిటల్ నుండి తెచ్చిన ఇ. సి. జి ని పట్టుకుని ఎనిమిది సంవత్సరాలనాటి ఇ. సి. జి. కోసం పెట్టెలో వెదకటం ప్రారంభించాడు.

ఎంత వెదికినా కన్పించదేం ?

తను దాన్ని పెట్టెలోనే పెట్టినట్లు జ్ఞాపకం.

ఇంట్లో వున్నది ఒక్కటే పెట్టె. మరి కన్పించదేం ?

వెదుకుతున్న అతని చేతికి తగిలి కంటికి కన్పించింది, ఒక కవరు.

ఆ కవరుమీద కమల చిరునామా. అపరిచితమైన దస్తూరీ.

కమల చిరునామా వున్న ఆ కవరును తను చూడకూడదనుకుంటూనే లోపల్నుంచి ఉత్తరాన్ని లాగేడు. కవరును మళ్లా పెట్లోనే వేశాడు.

చాలా చిన్న ఉత్తరమే. చివర సంతకం చూశాడు. రాజారావు....

ఎవరీ రాజారావు ? పేరు ఎక్కడో విన్నట్లుందే. అవును గుర్తొచ్చింది. కమల ఒకసారి పరిచయం చేసింది తన మేనబావని. అతను ఉత్తరం వ్రాశాడా ? కమలకి ? కమల ఎప్పుడూ చెప్పలేదే ! ఏమని వ్రాశాడు ?

రాజు ఉత్తరం చదవటం ముగించాడు.

కమలే ముందు రాజారావుకు ఉత్తరం వ్రాసిందని, అందులో అతన్నేదో సాయం కోరి వుంటుందని, అందుకు జవాబుగానే రాజారావు ఆ ఉత్తరం వ్రాశాడనీ అర్థమైంది రాజుకు.

కమల కోరిన సాయం కూడా సూచనప్రాయంగా అర్థమైంది. 'నా భర్త చావుబ్రతుకుల్లో ఉన్నాడు, ఆయన చనిపోతే నన్నూ నా పిల్లల్ని ఆదుకోవా' అని అడిగి వుంటుంది. అతను అభయమిస్తూ జవాబు.

తను బ్రతికివుండగానే తన భార్య తనని చంపివేసింది. ఆపై తన మనుగడకు వెరువు ఏర్పరచుకుంది.

ఇంతకంటే తనకు అవమానం ఏముంటుంది ?

ఇలాంటి అల్పబుద్ధి వున్న భార్యను ఉద్ధరించటానికేనా తను ఎనిమిది సంవత్సరాలు ఆశను ఊపిరిగా పీలుస్తూ బ్రతికింది ?

'ఇల్లాలు....బిడ్డలు....వారికోసమైనా నేను బ్రతకాలి డాక్టర్....'

ఒకనాడు తను డాక్టరుతో అన్న మాటలవి.

'ఈ ఇల్లాలు కోసమేనా!' డాక్టరు ఎదురుగా నిలబడి అపహాస్యం చేస్తున్నట్లు భ్రమ.

రాజు కూర్చోలేకపోయాడు. మెల్లిగా లేచి వెళ్లి మంచంమీద వాలిపోయాడు.

ఎంతకూ లేవని భర్తని తట్టి లేపాలని ప్రయత్నించిన కమల కెవ్వున అరిచింది. అతని శరీరం చల్లగా తగిలేసరికి.

డాక్టరు మూర్తికోసం కబురు వెళ్లింది.

'డెడ్' అన్నాడు డాక్టరు మూర్తి. రాజు శరీరాన్ని పరిశీలించికాని అక్కడ్నుంచి కదలేదు డాక్టరు.

అతనికి మిస్టరీలా వుంది రాజు మరణం. డిశ్చార్జి చేసేముందు అన్ని పరీక్షలూ చేసి అతని ప్రాణానికిక ఢోకా లేదని తీర్మానించుకున్నాడు తను. కాని ఇంతలోనే....

'సడన్ న్యూస్ ఏమైనా విన్నాడా ?' డాక్టరు మూర్తి కమలను ప్రశ్నించాడు.

తల అడ్డంగా తిప్పింది కమల.

డాక్టర్ మూర్తి దృష్టి అప్రయత్నంగా రాజు గుప్పిటమీద పడింది. బిగిసిన గుప్పెటలో నుంచి ఉత్తరాన్ని తీసి చదివేడు డాక్టర్ మూర్తి. చదివి కమలవైపు చూశాడు.

అప్పటివరకూ కమల కూడా చూడలేదు రాజు చేతిలోని ఉత్తరాన్ని. అది ఏమిటో తనకు తెలియదన్నట్లు తల వూపింది ఆమె.

కొన్ని క్షణాలు కమలనే చూస్తూ ఉండి 'ఈ ఉత్తరమే రాజును చంపింది' అంటూ కసిగా ఉత్తరాన్ని చింపేశాడు.

చెల్లాచెదురుగా క్రింద పడిపోయిన ఉత్తరం ముక్కలనూ, విసురుగా వెళ్లిపోతున్న డాక్టరు మూర్తినీ మార్చి, మార్చి అయోమయంగా చూస్తూ నిల్చుండిపోయింది కమల.

---